ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
మంగళవారం 14 మే 2024



ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు తీరిన ఓటర్లు



పోలింగ్ ప్రశాంతం

- మొరాయించిన ఈవీఎంలు
- కొన్ని చోట్ల ఆలస్యంగా ప్రారంభమైన ఓటింగ్
- పకడ్బందీ బందోబస్తు
- ఓటింగ్‌ను పర్యవేక్షించిన ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్ కటారియా, కలెక్టర్ అనురాగ్ జయంతి
- ఎన్నికల నిర్వహణలో 3500 మంది సిబ్బంది
- బందోబస్తులో 1500 మంది పోలీసులు
- సిరిసిల్ల, వేములవాడలో లోక్‌సభ ఎన్నికలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అభ్యర్థుల తలరాతలు మార్చే ఓటరన్న తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. సోమవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో చిన్న చిన్న సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగడంతో జిల్లా అధికార యంత్రాంగం పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటలు దాటినా కొన్ని పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఎన్నికల పరిశీలకుడు అమిత్ కటారియా, కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్ ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆధ్వర్యంలో డీఎస్పీలు నాగేంద్రచారి, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు పర్యవేక్షణ కొనసాగింది.

● మొరాయించిన ఈవీఎంలు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు శాసనసభ నియోజకవర్గాల్లో 547 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 287, వేములవాడ సెగ్మెంట్‌లో 360 కేంద్రాల్లో పోలింగ్ చేపట్టారు. మాక్ పోలింగ్ సమయంలోనే కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. వెంటనే సరిచేశారు. చందుర్తి మండలం కట్టలింగంపేటలో ఒక బూత్‌లో గంటన్నర, మర్రిగడ్డలో అరగంట వరకు ఓటింగ్ నిలిచిపోయింది. వేములవాడ మండలం శాత్రాజుపల్లి ఈవీఎం మొరాయించడంతో ఓటింగ్ ప్రక్రియ అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. రుద్రంగిలో ఈవీఎం మొరాయింపుతో అరగంట ఆలస్యంగా పోలింగ్ జరిగింది.

● ఉత్సాహంగా విధుల్లో పోలింగ్ సిబ్బంది

సిరిస్సిల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహణలో 3500 మంది సిబ్బంది పాల్గొన్నారు. పీవోలు 652, ఏపీవోలు 652, ఓపీవోలు 1304, మైక్రో అబ్జర్వర్లు 56 మంది, సెక్టోరియల్ అధికారులు 62 మంది, నోడల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, బీఎల్‌వోలతోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

● నిరంతరం నిఘా

సిరిసిల్ల, వేములవాడ పరిధిలో పోలింగ్ ప్రక్రియపై జిల్లా యంత్రాంగం నిరంతరం నిఘా పెట్టింది. కలెక్టరేట్‌లోని కమాండ్ కేంద్రం ద్వారా ఎన్నికల పరిశీలకుడు అమిత్ కటారియా, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ తీరును పరిశీలించారు. అక్కడి నుంచి పలు సూచనలు చేశారు.

● దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు

జిల్లాలో పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగుల కోసం అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీల్ ఛైయిర్‌లు, పోలింగ్ బూత్‌లకు వెళ్లడానికి ర్యాంప్‌లు ఇతర సౌకర్యం కల్పించారు.

● సందడి చేసిన యువత

జిల్లాలో కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీ, యువకులు ఉదయమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. క్యూలో నిలబడి ఓటు వినియోగించుకోవడంతోపాటు పోలింగ్ బూత్‌ల ముందు, ఫొటో బూత్ వద్ద ఫొటోలు దిగారు. సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

● ఓటింగ్‌ను పరిశీలించిన బండి సంజయ్

సిరిసిల్లలో కరీంనగర్ బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్ పోలింగ్ సరళిని పరిశీలించారు. సిరిసిల్లలోని జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, రాజీవ్‌నగర్‌లలో పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఓటర్లకు అభివాదం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోలింగ్ కేంద్రాల వద్ద ఓట్లు వేయడానికి వచ్చిన సందర్భంగా ఓటర్లకు అభివాదం చేశారు.



సిరిసిల్లలో పోలింగ్ బూత్ నుంచి వస్తున్న బండి సంజయ్

పటిష్ట పోలీస్ బందోబస్తు



రుద్రంగిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఎస్పీ అఖిల్‌మహాజన్, పర్యవేక్షణలో 1500 మందికిపైగా పోలీస్ సిబ్బంది నిర్వహణలో పాల్గొన్నారు. 57 రూట్ మొబైల్ బృందాలు, 13 క్విక్ రియాక్షణ్ బృందాలు, 13 స్ట్రయికింగ్ ఫోర్స్ బృందాలు అదనపు బలగాలు, నిరంతరం పహారా కాశాయి.

ఓటు వేసిన ప్రముఖులు

సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రుద్రంగిలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ఓటు వేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్‌దంపతులు, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిరిసిల్లలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, కోనరావుపేటమండలం నాగారంలో మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, బీజేపీ నాయకులు డాక్టర్ వికాస్‌రావు, రామన్నపేటలో జడ్పీ ఛైర్‌పర్సన్‌న్యాలకొండ అరుణ, మల్కపేటలో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, గంభీరావుపేట మండలం గజసింగవరం, నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు, గంభీరావుపేట మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి తదితరులు ఓటు వేశారు.




ఓటువేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి దంపతులు



లిస్ట్‌లో పేర్లను చూసుకుంటున్న ఓటర్లు



వేములవాడలో ఓటు వేసిన ట్రాన్స్ జెండర్లు





ఓటు వేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్ మహాజన్ దంపతులు





ఓటు వేసిన అదనపు కలెక్టర్లు పి.గౌతమి, ఖీమ్యానాయక్

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు



కరీంనగర్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసిన బీజేపీ అభ్యర్థి బండి సంజయ్, ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు కుటుంబ సభ్యులు, ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చున్న బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్, పార్లమెంట్ ఎన్నికల అధికారి పమేల సత్పతి కుటుంబ సభ్యులతో పాటు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. జ్యోతినగర్‌లోని సాధన స్కూల్ పోలింగ్ కేంద్రంలో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. క్రిస్టియన్‌కాలనీలోని శ్రేయ వొకేషనల్ కాలేజీ పోలింగ్ కేంద్రంలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తన కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ముకరంపురలోని ఉర్దూ మీడియం హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో తన సతీమణితో కలిసి ఓటుహక్కును వినియోగించు కున్నారు. హుస్నాబాద్ మండలకేంద్రంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మానకొండూర్ మండలం పచ్చునూరులో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దంపతులు, గంగాధర మండలం మధురానగర్‌లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఓటు వేశారు.

● అత్యధిక పోలింగ్ హుస్నాబాద్‌లో..

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో --- మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం సాయంత్రం 5 గంటల వరకు 67.67 శాతం పోలింగ్ నమోదైంది. కరీంనగర్ నియోజకవర్గంలో 55.82 శాతం, చొప్ప దండిలో 70.13, వేములవాడలో 71.26 సిరిసిల్లలో 69.58, మానకొండూర్‌లో 71.11, హుజూరాబాద్‌లో 68.67, హుస్నాబాద్ నియోజకవర్గంలో 73.63 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధిక పోలింగ్ శాతం హుస్నాబాద్‌లో, అత్యల్పంగా కరీంనగర్‌లో 55.82 శాతం నమోదయింది.

● పోలింగ్‌కు ఎండదెబ్బ

ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఒంటి గంట నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఓటు వేసేందుకు తక్కువ సంఖ్యలో ఓటర్లు రావడంతో పోలింగ్ కేంద్రాలు వెలవెలబోయాయి. ఈసారి అదనంగా గంట పెంచుతూ ఆరు గంటల వరకు ఎన్నికల కమిషన్ ఓటు వేసే అవకాశం కల్పించడంతో ఐదు గంటల నుంచి ప్రజలు ఓటు వేసేందుకు భారులు తీరారు. రాత్రి తొమ్మిదిగంటల వరకు కూడా పలు పోలింగ్‌కేంద్రాల్లో ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. పూర్తిస్థాయిలో ఎంత మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేది అధికారికంగా ప్రకటించలేదు.

● ఎవరి ధీమా వారిదే..

పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో ప్రధాన పార్టీలైన బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఎవరికివారు విజయావకాశాలపై అంచనాలు వేసుకుని గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలకు తరలించారు.

గతంలో కంటే పెరిగిన ఓటింగ్ శాతం

- సిరిసిల్ల సెగ్మెంట్‌లో 75.33,

వేములవాడ సెగ్మెంట్‌లో 74.43 శాతం నమోదు

సిరిసిల్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ లోక్‌సభ పరిధిలో ప్రధానంగా ఉన్న జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో 4.72 లక్షల మంది ఓటర్లకు 3,54,074 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 75.33 శాతం, వేములవాడ సెగ్మెంట్ 74.43 శాతం ఓటు హక్కు నమోదైంది. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,46,547 మంది ఓటర్లు ఉండగా 1,85,723 మంది, వేములవాడ సెగ్మెంట్‌లో 2,26,188 మంది ఓటర్లు ఉండగా 1,68,351 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

2019 పార్లమెంట్ ఎన్నికల కంటే ఈ సారి ఓటింగ్ శాతం పెరిగింది. అప్పటి ఎన్నికల్లో సిరిసిల్లలో 71.80 శాతం, వేములవాడలో 70.68 శాతం ఓట్లు పోలయ్యాయి. సిరిసిల్ల నియోజకవర్గంలో ఉదయం తొమ్మిది గంటలకు 7.23 శాతం, 11 గంటలకు 27.8 శాతం, మధ్యాహ్నం ఒంటి గంటకు 46.19శాతం, మూడు గంటలకు 55.67 శాతం, సాయంత్రం ఐదు గంటలకు 69.58శాతం, ఆరు గంటలకు 75.33 శాతం నమోదైంది. వేములవాడ నియోజకవర్గంలో ఉదయం ఏడు గంటలకు 12.5 శాతం, పదకొండు గంటలకు 30.17శాతం, మధ్యాహ్నం ఒంటి గంటకు 50.11శాతం, మూడు గంటలకు 62.45 శాతం, సాయంత్రం ఐదుగంటలకు 71.26శాతం, ఆరు గంటలకు 74.43 శాతం నమోదయింది.



కరీంనగర్ ఓటర్లకు ధన్యవాదాలు

• మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మే 13: కరీంనగర్ ఓటర్ల ఆశీర్వచనంతో కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలవబోతున్నారని, ఓటర్లకు దన్యవా దాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 200 యూనిట్లు పొందిన ఉచిత ఓటర్లుకు, ఆర్టీసీలో ప్రయాణం చేసిన మహిళా ఓటర్లుకు, రూ.500కు గ్యాస్‌సిలిండర్లు లబ్ధి పొందిన ఓటర్లుకు, భవిష్యత్తులో ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఆకాంక్షించిన ఓటర్లుకు, 4 వేల రూపాయలు పెన్షన్ వసాయని ఆకాంక్షించిన ఓటర్లుకు, రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ ఆకాంక్షించిన ఓటర్లుకు, రిజర్వేషన్లు ఎత్తివేస్తారని కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓటర్లకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. వైశ మ్యాలు దూరంగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ సరైనదని భావిం చి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన బడుగు, బలహీన వర్గాలకు ప్రత్యేక ధన్యవాదాలని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. హుస్నాబాద్, హుజూరాబాద్, మానకొండూర్, కరీంనగర్, చొప్ప దండి, వేములవాడ, సిరిసిల్ల ఓటర్లకు ధన్యవాదాలన్నారు.



పొన్నం ప్రభాకర్

గిరిజన గ్రామాల్లో వెల్లివిరిసిన చైతన్యం

- ఆదర్శంగా నిలిచిన చిన్నకొల్వాయి
- మధ్యాహ్నంలోగానే వందశాతం పోలింగ్ నమోదు
- సిబ్బందికి ఫోన్‌లో కలెక్టర్ అభినందన



చిన్నకొల్వాయి గ్రామం

బీర్‌పూర్, మే 13: జగిత్యాల జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామంలో చైతన్యం వెల్లివిరిసింది. అంతగా అక్షరాస్యత కూడా లేని గిరిజనులు తమ ఓటు హక్కు వినియోగించుకుని మధ్యాహ్నం 12 గంటలకే పోలింగ్ 100 శాతం నమోదు చేశారు. బీర్‌పూర్ మండలం న్నకొల్వాయి గ్రామంలో 165 మంది జనాభాకు గాను 94 మంది మహిళలు, 71 మంది పురుషులు ఉన్నారు. వీరిలో పురుషుల ఓటర్లు 45 కాగా మహిళలు 65 వీరంతా వ్యవసాయం చేస్తూ జీవిస్తారు. సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఉదయం 7గంటల నుండి పోలింగ్ కేంద్రానికి చేరుకుని తమ ఓటు హక్కు వినియోగించుకుని సమాజానికి ఆదర్శంగా నిలిచారు. మారుమూల గిరిజన గ్రామంలో మధ్యాహ్నంవరకే పోలింగ్ 100శాతం నమోదు కావడం పట్ల జిల్లా కలెక్టర్ ఫోన్ ద్వారా ఎన్నికల సిబ్బందిని ప్రశంసించినట్లు సమా చారం. అదేవిధంగా ఎన్నికల సెక్టర్ అధికారి చెక్కు నాయక్, రూట్ ఆఫీసర్ రాజు కుమార్, కార్యదర్శులు ముద్దం విజయ, నారాయణ, అంగన్‌వాడీ టీచర్ బేరా యశోధ, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

- ఓటు కోసం 1,300 కిలోమీటర్ల ప్రయాణం

చిన్నకొల్వాయి గ్రామానికి చెందిన కోట్నాక శ్రీను హరిప్రియలు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సిరికోల్ జిల్లాలో ఓ మైనింగ్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడం కోసం భార్య హరిప్రియ తో కలిసి 1,300 కిలోమీటర్లు ప్రయాణించి వచ్చి ఓటు వేశాడు. ఇంతగా ఇబ్బందితో ఎందుకు వచ్చారని అడుగగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయ లేక పోయామని అందుకు చాలా బాధగా అనిపించి వచ్చామని వివరిం చారు. అలాగే గ్రామానికి చెందిన కోట్నాక తిరుపతి, చిత్రం బుచ్చి రాములు కూడా హైదారాబాద్ నుంచి ఓటు వేయడానికి రావడం విశేషం.



మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన దంపతులు



మొదటిసారి ఓటు వేసిన యువతులు

రోడ్డుపై విరిగిపడిన చెట్టు కొమ్మ

- తొలగించిన పోలీసులు

ఎండపల్లి, మే 13: ఇటీవలే కురిసిన చిరుజల్లు వర్షానికి, ఈదురు గాలులకు మండంలోని శానబండ గ్రామంలో నడిరోడ్డుపై చెట్టు కొమ్మ విరిగి పడింది. ఎన్నికల విధులలో భాగంగా శానబండ వెళుతున్న పోలీసులు తమ వాహనాన్ని ఆపి స్వయంగా పోలీసులు కొమ్మను పక్కకు తీసేసి గ్రామంలోకి వెళ్లారు. పోలీస్ సేవే కాకుండా సమాజ సేవ చేయడం పట్ల అటు నుండి వెళుతున్న ప్రయాణికులు ఫోటో తీసి గ్రామాలలోని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. వీరిని గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వేణు, కిరణ్, తిరుపతి పాల్గొన్నారు.



చెట్టు కొమ్మను తొలగిస్తున్న పోలీసులు

బీజేపీ కార్యకర్తపై దాడి

కథలాపూర్, మే 13: మండలంలోని చింతకుంటలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఎస్సై నవీన్ కథన ప్రకారం...పోలింగ్ జరుగుతున్న సమయంలో గ్రామం నుంచి వాహనంలో బీఆర్ఎస్ నాయకులు ఓటర్లను తరలిస్తుండగా బీజేపీ కార్యకర్త నేతుల మల్లేశం అభ్యంతరం తెలిపాడు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లేశంను కొట్టడంతో పాటు టాటా ఏస్ వాహనం ఎక్కించారు. దీంతో మల్లేశం కాలు విరిగింది. వెంటనే చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి కరీంనగర్ పంపించామన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించడంతో పాటు దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. బాధితుడి కుటుంబాన్ని బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు సాయంత్రం పరామ ర్శించారు.

యువకుడిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, మే 13: మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన జయరాజ్ అనే యువకుడు ఓటు వేస్తు సెల్ఫీ దిగాడు. గ్రామంలోని 8వ నెంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వెళ్లి సెల్ఫీ దిగినట్లు అధికారులు గుర్తించారు. వెబ్ కెమెరాలను గుర్తించి పోలింగ్ సిబ్బంది ఉన్నతిధికారులకు చెప్పారు. యువకుడి నుంచి సెల్‌ఫోన్‌ను అధికారు స్వాధినం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీస్‌లు కేసు నమోదు చేశారు.

యువకులు, మహిళలపై ఇన్‌చార్జి ఎస్సై లాఠీచార్జి



స్థానికులపై లాఠీచార్జి చేస్తున్న ఎస్ఐ రమేశ్

ఎల్లారెడ్డిపేట, మే 13: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఎస్సై అల్లం రమేశ్ ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్‌లో సోమవారం అత్యుత్సాహం ప్రదర్శించారు. నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి బయట నిలబడిన యువకులు, మహిళలపై ప్రతాపం చూపారు. దుకాణాలు మూసి వేయాలంటూ హంగామా సృష్టించారు. ఎస్సీ కాలనీలోకి దూసుకెళ్లి యువకులు రొడ్డ మహేశ్, వేములవాడ పూర్ణచందర్‌తోపాటు మహిళలను లాఠీతో కొట్టారు. మహేశ్ కాలుపై వాతలు తేలాయి. కేంద్రానికి దూరంగా ఉన్న వంగ మల్లారెడ్డి ఇంటి వద్దకెళ్లి ఇక్కడేం చేస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లు తనదేనని చెప్పిన వినకుండా ఆధార్ కార్డు తీసుకురమ్మన్నారు. ఆధార్ కార్డును చూపితే లాక్కొని అసభ్యపదజాలంతో దూషించారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. ఎస్సై రమేశ్ తీరుపై స్థానికులు, మహిళలు తిరగబడ్డారు. అకారణంగా చితకబాదారంటూ నిలదీశారు. ఎస్సైకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు అక్కడకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్న ఎందుకు కొడుతారని పోలీసులను నిలదీశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ అక్కడికి చేరుకొని ఎస్సై రమేశ్‌ను అక్కడినుంచి పంపించారు. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు వెళ్లిపోయారు. ఎస్సై తీరుపై బాధితుడు మహేశ్ ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, స్థానిక నాయకులు తెలిపారు.



ఎస్ఐతో వాగ్వాదానికి దిగిన నాయకులు, స్థానికులు



బోనాలతో తరలివెళ్తున్న భక్తులు

గోరంటాలలో ఎల్లమ్మ సిద్దోగం ఉత్సవాలు

గంభీరావుపేట, మే 13: గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ సిద్దోగం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి మంగళవారం వరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. సోమవారం పుట్టకు ధని పోయడంలో భాగంగా బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రాత్రి ఎల్లమ్మకు బోనాలను సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మొలకెత్తిన ధాన్యం .. అన్నదాతల ఆందోళన

ఎల్లారెడ్డిపేట, మే 13: కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం వర్షాలకు మొలకెత్తడంతో అన్నదాతలు అందోళన చెందుతున్నారు. కొనుగోళ్లలో నెలకొంటున్న జాప్యంతో కేంద్రాల వద్ద రోజుల తరబడి ఎదురుచూస్తున్న కర్షకులకు వర్షం మరో సమస్యగా మారింది. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి గత నెల 22న రైతు సంకూరి శంకర్ ధాన్యం తీసుకొచ్చారు. 17 శాతం తేమ నిబంధన ఉండటంతో వడ్లు ఆరబెట్టారు. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వర్షంతో ధాన్యం తడిసిపోయి మొలకెత్తింది. మొలకెత్తిన ధాన్యాన్ని వేరు చేసి ఆరబెట్టేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని రైతు శంకర్ వాపోయాడు. సుమారు 20 మంది రైతులకు సంబంధించిన ధాన్యం తడిసి పోయి మొలకలు వచ్చాయని తెలిపాడు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్నారు.



రాజన్నపేటలో మొలకెత్తిన ధాన్యం



సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



కేశవపట్నంలోని మహిళా మోడల్ కేంద్రంలో...



వీణవంక పోలింగ్ కేంద్రంలో మహిళల క్యూ



కరీంనగర్‌లోని ముఖరంపుర ఉర్దూ మీడియం పాఠశాలలో

వెల్లువెత్తిన

ఓటరు చైతన్యం

పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు ఉత్సాహంగా తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. యువత ఓటు వేయడానికి ఆసక్తి చూపించారు. మొదటి రెండు గంటల్లో మందకొడిగా ఓటింగ్ జరుగగా, 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ తర్వాత ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో చాలా చోట్ల ఓటర్లు లేక పోలింగ్ కేంద్రాలు వెలవెలబోయాయి. తిరిగి సాయంత్రం 4 గంటలనుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.



పెగడపల్లి మండలం ఆరవెల్లిలో మొదటిసారి ఓటు వేసిన యువత



సిరిసిల్లలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



ఇల్లందకుంట మండలం మర్రివానిపల్లెలో వృద్ధురాలు..



కాల్వశ్రీరాంపూర్‌లో వికలాంగుడిని వీల్‌చైర్‌లో తీసుకువస్తున్న తహసీల్దార్ జాహెద్‌పాషా



మల్యాలలో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తున్న సిబ్బంది



రాయికల్‌లో మొదటి సారి ఓటు వేసిన యువతులు



గోదావరిఖనిలో ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్లు



కరీంనగర్‌లో తొలిసారి ఓటు వేసిన యువతులు



కరీంనగర్‌లో బారులు తీరిన ఓటర్లు



తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో మహిళా పోలింగ్ కేంద్రం



మెట్‌పల్లి మండలంలోని ఏఎస్ఆర్‌తండాలోని ట్రైబల్ మోడల్ కేంద్రం

కాంగ్రెస్ అభ్యర్థిపై ఫిర్యాదు

కరీంనగర్ క్రైం/భగత్‌నగర్,మే 13: కరీంనగర్ నియోజక వర్గం కాంగ్రెస్ అభ్యర్థిపై బీజేపీ నాయకుడు, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఈవి ఎంలో నాల్గవ నెంబర్ కేటాయించడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 4వ నెంబర్ గల టీషర్టులు ధరించి పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహించారన్నారు. ఎన్నికల నియామవళిని ఉల్లంఘించిన కాంగ్రెస్ అభ్యర్థిపై చర్యలు చేపట్టాలని బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుపై ఎన్నికల నియామవళి ఉల్లంఘనపై ఎన్నికల కేసు నమోదు చేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఎల్లారెడ్డిపేట, మే 13: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి శివారులోని కొత్తకుంట చెరువులో చేపల వేటకు వెళ్లి ఈ నెల 12న గల్లంతైన ఆలకుంట రాజు (35) మృతదేహం సోమవారం లభించినట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. గొల్లపల్లికి చెందిన రాజు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి గ్రామ శివారులోని కొత్తకుంట చెరువులో చేపలకు వేటాకు వెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికులు అదే రోజు రాత్రి గాలింపు చేపట్టారు. చీకటి ఉండడం.. వర్షం పడుతుండడంతో గాలింపునకు ఆటంకం ఏర్పడింది. సోమవారం ఉదయం కొత్తకుంట చెరువులో రాజు శవమై తేలాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, మే 13: మండలంలోని రాంపూర్ గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం పశ్చిమ చంపార జిల్లాకు చెందిన సంజీవ్ మిశ్రా(49) అనే వ్యక్తి సీడ్ కంపెనీలో ప్రొడక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 6 గంటలకు వృత్తిలో భాగంగా జమ్మికుంట మండలం నగురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో రాంపూర్ గ్రామంలోని హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనంపై అదుపు తప్పి డివైడర్‌ను కొట్టి కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే ఆయనను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అమ్మవారి ఆశీస్సులు తీసుకుని.. అమ్మతో కలిసి

● ఓటు హక్కు వినియోగించుకున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 13: మహాశక్తి అమ్మవారి ఆశీస్సులు... అమ్మతో కలిసి నగరంలోని జ్యోతినగర్‌లోని 174 పోలింగ్ కేంద్రంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కుమార్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నగరంలోని మహాశక్తి దేశాలయంలో సతీసమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి ఆశీస్సులు తీసుకుని తల్లితో కలసి, కుటుంబ సభ్యులతో పాటు ఓటు హక్కు వినియోగించుకున్నారు.



విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న బండి సంజయ్ దంపతులు

● పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన బండి

కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని పలు పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. నగరంలోని కిసాన్‌నగర్ కేంద్రం వద్ద ఓటర్లకు అభివాదం చేశారు. మానకొండూర్, వీణవంక, జమ్మికుంట, హుజూరాబాద్, సైదాపూర్, హుస్నాబాద్, చిగురుమామిడి, సిరిసిల్ల, వేములవాడలో ఓటింగ్ సరళిని పరిశీలించారు.

అనుమానాస్పద స్థితిలో గొర్రెలు మృతి

రాయికల్, మే 13: మండలంలోని అయోధ్య గ్రామంలో యాదవ కులస్థులకు చెందిన 20 గొర్రెలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. గ్రామానికి చెందిన ఒర్రె గంగమల్లయ్య, ఒర్రె రమేష్, ఒర్రె గంగరాజం దినసరి వృత్తిలో భాగంగా గొర్రెలు, మేకలను మేపుతుంటారు. ఈ క్రమంలో గొర్రెలు కొన్ని గంటల వ్యవధిలోనే అనుమానాస్పదంగా కిందపడి కొట్టుకుని మృతి చెందినట్లు గొర్రెల యాజమానులు తెలిపారు. పశువైద్యాధికారి శ్రీనివాస్‌కు సమాచారం అందించగా మృతిచెందిన గొర్రెలకు పంచనామా నిర్వహించి క్రిమిసంహారక మందులు తిని మరణించినట్లు తెలిపారు. ఈ క్రిమి సంహారక మందులు వన్యప్రాణులను వేటాడేందుకు పెట్టినవిగా స్థానికులు భావిస్తున్నారు. కాగా గ్రామానికి చెందిన ఒర్రె గంగ మల్లయ్యకు చెందిన 12 గొర్రెలు, మేకలు, ఒర్రె రమేష్‌కు చెందిన నాలుగు గొర్రెలు, ఒర్రె గంగరాజంనకు చెందిన నాలుగు గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.3 లక్షలకు పైగా ఆర్థికంగా నష్టపోయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ ఎడమల జీవన్‌రెడ్డి, యాదవ సంఘం మండల అధ్యక్షుడు వాసరి రవి యాదవ్ కోరారు.

ఓటు వేసే వీడియో సోషల్ మీడియాలో వైరల్

● ఇద్దరిపై కేసు నమోదు

జగిత్యాల టౌన్, మే 13: ఎంపీ ఎన్నికల పోలింగ్ సమయంలో ఓటు వేసి వీడియో తీసి ఈవీఎంతో పాటు బ్యాలెట్ పేపర్ కనబడే విధంగా సోషల్ మీడియాలో వైరల్ చేసిన ఇద్దరిపై జగిత్యాల టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఖిలాగడ్డకు చెందిన నదీమ్, సమీర్ అనే వ్యక్తులు ఈ చర్యకు పాల్పడ్డట్లు ఎఫ్ఎస్‌టీ టీం ఇన్‌చార్జి కుమార స్వామి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

అంజన్న నిత్యాన్నదానంకు రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

మల్యాల, మే 13: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానంకు స్వామి వారి భక్తులు సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన డి.కృష్ణ వారి కుమారుడు అంజన్ ఈ విరాళంను అన్నదాన విభాగం ఇన్‌చార్జీ రాజేందర్ రెడ్డికి అందించారు. భక్తులు కొండగట్టులో నిర్వహిస్తున్న నిత్యన్నదాన పథకంకు విరివిగా విరాళాలు అందించాలని ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు కోరారు.

నృసింహ నవరాత్రోత్సవాలు ప్రారంభం



స్వామివారలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, మే 13: ధర్మపురి క్షేత్రంలో నృసింహ నవరాత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5-30 గంటలకు అర్చకులు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరి నదికి బయలుదేరి వెళ్లారు. గోదావరి నదిలో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి బిందె తీర్థం తీసుకువచ్చారు. ఉదయం 6-30 గంటలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కు మార్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వస్తి పుణ్యాహవచనం, రుత్విక్వరణం, కలశ స్థాపన, స్వామివారలకు పంచోపనిషత్తులచే అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు సహస్ర కలశ స్థాపన, నవగ్రహ, యోగినివాస్తు, క్షేత్ర పాలక స్థాపనలు, అర్చనాది ఆరాధన, హారతి పూజలు నిర్వహించారు.



బిందె తీర్థం తీసుకువస్తున్న అర్చకులు

చెట్టును ఢీకొట్టిన కారు : ముగ్గురికి గాయాలు

జమ్మికుంట రూరల్, మే 13: జమ్మికుంట మండలం తనుగుల గ్రామ మూల మలుపు వద్ద ఓ కారు చెట్టును ఢీకొన్న సంఘటనలో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. కాల్వశ్రీరాంపూర్ మండలం బేగంపేటకు చెందిన శ్రీనివాస్, రమ దంపతులు తమ కుమార్తెతో కలిసి ఓటు వేసేందుకు కారులో వరంగల్ నుంచి స్వగ్రామానికి వెళుతున్నారు. మార్గ మధ్యలో తనుగుల గ్రామ పరిధిలో మూల మలుపు వద్ద ప్రమాదవశాత్తు కారు చెట్టును ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. అటువైపుగా వస్తున్న హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కార్యకర్తల సహాయంతో గాయపడ్డ వారిని 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఒకరి ఆత్మహత్య

పాలకుర్తి, మే 13: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈసాల తక్కళ్ళపల్లిలో సోమవారం ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బానోతు తిరుపతి(35) భార్య పుట్టింటికి వెళ్లి కొన్ని రోజుల నుంచి తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి కూతురు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, మే 13: పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన నర్ర రాము(25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలిసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని నెలల క్రితం రాము తండ్రి మృతిచెందగా అప్పటినుంచి మానసిక వేదనకు గురవుతున్నాడు. ఈ నెల 3న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా సోమవారం మృతిచెందాడు. మృతుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

ఓటర్లకు డబ్బులు పంచిన ఇద్దరిపై కేసు

వీణవంక, మే13: మండలంలోని చల్లూరు, ఎలబాక గ్రామాల్లో ఓటర్లకు డబ్బులు పంచుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. చల్లూరు గ్రామంలో పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు డబ్బులు పంచుతున్న బీజేపీ నాయకుడు రామిడి అదిరెడ్డిని ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ వడ్లకొండ ఐలయ్య పట్టుకొని 11వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఐలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలబాక గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు ఊట్ల దేవయ్య ఓటర్లకు డబ్బులు పంచుతుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్ రామ్‌కుమార్ పట్టుకొని 14 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. రామ్‌కుమార్ ఫిర్యాదు మేరకు దేవయ్యపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం పైనుంచి పడి ఒకరి మృతి

ముస్తాబాద్, మే 13 : మండలంలోని తుర్కపల్లె గ్రామానికి చెందిన అంకని భూమయ్య(56) అనే వ్యక్తి ద్విచక్రవాహనం పైనుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. తుర్కపల్లెకు చెందిన అంకని భూమయ్య పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం పైనుంచి కిందపడి చనిపోయాడు. భూమయ్య కొడుకు అంకని సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కౌన్సిలర్ ఇంట్లో మద్యం పట్టివేత

సిరిసిల్ల టౌన్, మే 13: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులోని కౌన్సిలర్ గడ్డ శ్రీనివాస్ ఇంట్లో మద్యం పంచుతుండగా సోమవారం పార్లమెంట్ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ గడ్డ శ్రీనివాస్(బీఆర్ఎస్) దాదాపు లక్ష రూపాయిలు విలువ చేసి మద్యం ఇంట్లో నిలవ చేసినట్లు తెలిసింది. శనివారం రాత్రి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ఓటు వేయాలంటూ ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ మద్యంను పంచుతున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లడంతో సోమవారం దాడులు చేశారు. కౌన్సిలర్ గడ్డ శ్రీనివాస్ ఓటర్లకు మద్యం పంచుతుండగా ఇంట్లోనే పట్టుకున్నారు. అధికారుల దాడిలో రూ. 25వేల విలువ చేసే మద్యం దొరికింది. కౌన్సిలర్ గడ్డ శ్రీనివాస్‌ను విచారణ జరిపి మద్యానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

రాజన్నకు భక్తుల మొక్కులు

వేములవాడ టౌన్, మే 13 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పోలింగ్ రోజూ సోమవారం భక్తుల రద్దీ కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. గండాదీపంలో నూనె పోసి గండాలు తొలగాలని వేడుకున్నారు. అనంతరం అనబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలీసుల పహారా మధ్య పోలింగ్


ఓపెన్‌టాప్ జీప్‌లో ఎస్పీ పెట్రోలింగ్

సిరిసిల్ల క్రైం, మే 13: జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పహారా మధ్య లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా సాగింది. జిల్లా వ్యాప్తంగా 58 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద 13క్విక్ రియాక్షన్ టీమ్‌లు, 2స్ట్రయికింగ్ టీమ్‌లు, 6స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్‌లు, ప్రత్యేక కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ అఖిల్ మహాజన్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

● ఓపెన్‌టాప్ జీప్‌లో పెట్రోలింగ్

లోక్ సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరకుగండా సిరిసిల్ల పట్టణంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఓపెన్‌టాప్ జీప్‌లో పెట్రోలింగ్ నిర్వహించారు. రెండు రోజులుగా ఎస్పీ అఖిల్ మహాజన్ ఓపెన్‌టాప్ జీప్‌లో కేంద్ర పోలీసు బలగాలతో పెట్రోలింగ్ చేశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రభుత్వ విప్

రుద్రంగి, మే 13: రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 93వ బూత్‌లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఓటు వినియోగించుకున్నారు. ఆయన కుమారుడు కార్తీక్ ఓటు వేశారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద ఓటు వేయడానికి వెళ్తున్న సమయంలో ఓటర్లకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పోలింగ్ స్లిప్పులను అందజేశారు.

బీరప్ప కల్యాణ మహోత్సవంలో ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మే 13: కోనరావుపేట మండలం పల్లిమక్తలో కొనసాగుతున్న బీరప్ప కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం హాజరయ్యారు.ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు నాయని ప్రభాకర్ రెడ్డి, సిద్దరవేణి ప్రభాకర్, మల్లేశం, ఆనందం, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు

వేములవాడ టౌన్, మే 13 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా రెండు నెలలుగా ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని పార్టీ కార్యలయంలో బూత్‌లెవల్ ఏజెంట్లతో సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ఓటర్లను చైతన్య పరిచేందుకు కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. బింగి మహేష్, పాత సత్యలక్ష్మి, సాగరం వెంకటస్వామి, సంద్రగిరి శ్రీనివాస్, కనికరపు రాకేష్, చిలుక రమేష్, పుల్కం రాజు, వంగల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తెరుచుకున్న వైన్స్‌లు

సిరిసిల్ల క్రైం, మే 13: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈనెల 11న మాసివేసిన వైన్స్‌లు, బార్ అండ్ రెస్టారెంట్‌లు సోమవారం సాయంత్రం 6 గంటలకు తెరుచుకున్నాయి. లోక్ సభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని 48 వైన్స్‌లు, 6 బార్ అండ్ రెస్టారెంట్‌లు ఈ నెల 11న సాయంత్రం 6 గంటలకు మూసివేశారు. పోలింగ్ ముగియడంతో సోమవారం సాయంత్రం 6 గంటలకు తెరిచారు. దాదాపు 48గంటల పాటు మూసి ఉన్న వైన్స్‌లు ఎట్టకేలకు తెరుచుకోవడంతో మద్యం ప్రియులు బారులుదీరారు.

సీబీఎస్‌సీ పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, మే 13: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సోమవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారని ప్రధానాచార్యుడు రామారావు తెలిపారు. పాఠశాలలోని 71 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరవగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించారు.

ఉద్దేశ పూర్వకంగానే విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల కలెక్టరేట్, మే 13 : పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సెస్ అధికారులు ఉద్దేశపూర్వకంగానే విద్యుత్ అంతరాయం కల్గించారని, వారిపైచర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, పీసీసీ నాగుల సత్యనారాయణగౌడ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిని కలిశారు. సెస్ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ పిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని వీర్నపల్లి మండలంలో ఆదివారం నుంచి సోమవారం వరకు విద్యుత్ అంతరాయం కల్గించి మండల ప్రజలకు ఇబ్బంది కల్గించిందన్నారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే కరెంట్ పరిస్థితి ఇలానే ఉంటదని కొందరు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారని, వారి ప్రోద్బలంతోనే సెస్ అధికారులు ఉద్దేశపూర్వకంగా విద్యుత్ తీసివేశారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్ విచారణ చేపట్టాలని, సెస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, నాయకులు కాసర్ల రాజు పాల్గొన్నారు.

దేశంలోనూ మార్పు కోరుకుంటున్న ప్రజలు

ముస్తాబాద్, మే 13 : రాష్ట్రంలో మార్పు కోరుకున్నట్లుగానే ప్రజలు దేశంలోనూ మార్పును కోరుకుంటున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో సోమవారం మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తన రాజకీయ భవిష్యత్‌ను, ఉనికిని కాపాడుకోవడానికి సిరిసిల్ల నియోజక వర్గ వ్యాప్తంగా ఓటుకు రూ .500 పంపిణీ చేసినట్లు తెలుస్తోందన్నారు. మద్యం, డబ్బులు పంపిణీ చేయబోమని కేటీఆర్ చెబుతున్నా రాత్రికి రాత్రే పెద్ద మొత్తంలో పంపిణీ జరిగిందని ఆరోపించారు.పార్లమెంటరీ కో ఇన్‌చార్జి కనమేని చక్రధర్‌రెడ్డి, నాయకులు కొండం రాజిరెడ్డి, మంత్రి రాజం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై సీఆర్పీఎఫ్ బలగాల లాఠీచార్జి

వేములవాడ టౌన్, మే 13 : కాంగ్రెస్ కార్యకర్తలపై సీఆర్పీఎఫ్ బలగాలు దాడి చేసిన సంఘటన వేములవాడ పట్టణం సుభాష్‌నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన ఫిరోజ్, ఇంతియాజ్ తమ ఇంటి ముందు కుటుంబ సభ్యులతో కలిసి కూర్చున్నారు. అటుగా వెళ్లిన సీఆర్పీఎఫ్ సిబ్బంది వాహనాలను నిలిపి అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసిన వారు ఇంట్లోకి వెళ్లారు. అక్కడే ఉన్న ఫిరోజ్‌పై దాడి చేశారు. ఎస్పీ ఆధ్వర్యంలోనే దాడి జరిగిందని బాధితులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హుటాహుటిన ఫిరోజ్ ఇంటికి చేరుకున్నారు. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అకారణంగా తమపై దాడికి పాల్పడిన పోలీసు బలగాలపై న్యాయ విచారణ చేపట్టాలని బాధితుల కుటుంబ సభ్యుల కోరుతున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ఫోన్ ద్వారా పరామర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఘటనపై ఐజీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీస్ ఉన్నతాధికారులను వివరణ కోరగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉందని, సుభాష్‌నగర్‌లో గుంపులుగా కనిపించడంతో సీఆర్పీఎఫ్ సిబ్బంది చెదరగొట్టారని తెలిపారు.

మొరాయించిన ఈవీఎంలు

చందుర్తి, మే 13: చందుర్తి మండలంలోని మర్రిగడ్డలో 111, కట్టలింగంపేటలో 101 పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించాయి. మర్రిగడ్డలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 111 బూత్‌లో ఉదయం పోలింగ్ ప్రారంభ సమయంలో ఈవీఎం మొరాయించడంతో దాదాపు అరగంట తర్వాత అలస్యంగా ప్రారంభమైంది. కట్టలింగంపేట ప్రాథమిక పాఠశాలలో 101 పోలింగ్ బూత్‌లో 778 మంది ఓటర్లకు 245 ఓట్లు పోలైన అనంతరం ఈవీఎం మొరాయించింది. దాదాపు గంటన్నర పాటు పోలింగ్ నిలిచిపోయింది. ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లు వెనుదిరిగి వెళ్లిపోయారు. అనంతరం టెక్నీషియన్స్ పోలింగ్ బూత్ వద్దకు చేరుకొని ఈవీఎంను మరమ్మత్తు చేపట్టి యదావిధిగా పోలింగ్ కొనసాగించారు.

ఊరూరా ఓట్ల పండుగ

ప్రశాంతంగా ముగిసిన పార్లమెంట్ ఎన్నికలు


వీర్లపల్లిలో ఓటేసేందుకు బారులుదీరిన మహిళలు

సిరిసిల్ల రూరల్, మే 13 : జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు జనం బారులుదీరారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతగా సాగింది. విలీన గ్రామాలైన రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్దాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లోకి ప్రజలు ఉదయం 7గంటలకు వచ్చి ఓటు వేశారు. ఈ సారి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థులను గెలిపించాలని అయా పార్టీలకు చెందిన నాయకులు హోరాహోరీగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓట్లు వేయాలంటూ అభ్యర్థించారు. పార్టీలకు చెందిన కండువాలు, కరపత్రాలను సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ స్వాధీనం చేసుకున్నారు. కార్మిక క్షేత్రమైన రాజీవ్‌నగర్‌లోని ప్రభుత్వం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బీజేపీ అభ్యర్థి బండిసంజయ్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావుతోపాటు వార్డుల కౌన్సిలర్లు పోచవేణి సత్యఎల్లయ్యయాదవ్, పాతూరిరాజిరెడ్డి, బుర్రలక్ష్మీశంకరయ్య, కల్లూరిలత మధు, భూక్యరెడ్డినాయక్, బోల్గం నాగరాజుగౌడ్, చెన్నమనేని కీర్తికమలాకర్‌రావు, లింగంపల్లి సత్యనారాయణ, నాయకులు ఓట్లు వేశారు.

ఇల్లంతకుంట: లోక్‌సభ ఎన్నికలు మండలంలో ప్రశాంతగా ముగిశాయి. మండలంలో 4067 మంది ఓటర్లకు 58 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఉదయం పోలింగ్ ఎక్కువగా జరుగగా మధ్యాహ్నం మందకొడిగా సాగింది. ఓటర్లను తరలించడానికి ఆయా పార్టీల నాయకులు వాహనాలను ఏర్పాటు చేశారు. పలు పోలింగ్ బూత్‌లలో ఓటు వేసే ప్రదేశంలో సరైన వెలుతురు లేకపోవడంతో వృద్ధులు ఇబ్బంది పడ్డారు. జిరాక్స్ ధ్రువీకరణ పత్రాలను తీసుకొచ్చిన ఓటర్లను అధికారులు తిప్పిపంపారు. రాష్ట్ర ఆహారభద్రతా కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ తన స్వగ్రామం గాలిపెల్లిలో, జడ్పీవైస్ ఛైర్మన్ సిద్ధం వేణు పొత్తూరులో, ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి సోమారంపేటలోఓటుహక్కును వినియోగించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. గెలుపుపై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

రిసెప్షన్‌కు చేరుకున్న ఈవీఎంలు


ఈవీఎంలను రిసెప్షన్‌కు అందజేస్తున్న సిబ్బంది

వేములవాడ టౌన్, మే 13 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసి ఎన్నికల సామాగ్రి సోమవారం రాత్రి రిసెప్షన్‌కు చేరుకున్నాయి. వేములవాడ నియోజకవర్గంలో మొత్తం 260 పోలింగ్ కేంద్రాలకు సరఫరా చేసిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లతో పాటు ఎన్నికల సామగ్రిని సిబ్బంది వేములవాడలోని జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్‌కు తరలించారు. సాయంత్రం కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు.


పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలో ఉదయం 9 గంటల తర్వాత పోలింగ్ జోరందుకుంది. ఎండకు తాళలేమని భావించిన కొందరు ఓటర్లు ఉదయాన్నే కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగంచుకున్నారు. కిషన్ దాస్‌పేటలోని 78 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అధికారులు సరి చేయడంతో సజావుగా కొనసాగింది. వృద్ధులు, మహిళలు, యువతులు, యువకులు ఓటు వేసేందుకు ఉత్సాహంగా కదిలి వచ్చారు. మొదటి సారి వచ్చిన ఓటు హక్కును యువతీ యువకులు వినియోగించుకున్నారు. గొల్లపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ అఖిల్‌మహాజన్ పరిశీలించారు. ఎల్లారెడ్డిపేట, గొల్లపల్లి గ్రామాల్లో నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ రవీందర్‌రావు, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సందర్శించారు. రాజన్నపేటలో బీఆర్ఎస్ నాయకులు గులాబి రంగు, కాంగ్రెస్ నాయకులు పచ్చరంగు కండువాలు వేసుకున్నారని ఆరోపిస్తూ పరస్పరం వాగ్వావాదానికి దిగారు. పోలీసులు వర్గాల వారిని శాంతింపజేశారు.

● మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్దకు ఉదయం 7 గంటలకే ఓటర్లు చేరుకున్నారు. ఉదయం బారులుదీరినా మధ్యాహ్నం ఒంటి గంటల తర్వాత బోసిపోయాయి. ఎండ వేడిమికి ఓటర్లు లేక కేంద్రాలు నిర్మానుష్యంగా మారాయి. గుంటపల్లిచెరువుతండా, బుగ్గరాజేశ్వర తండా, కిష్టునాయక్ తండా ప్రజలు ఉదయం 7.30 గంటలకే సుమారు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు.

● మండలంలోని పదిరలో సాయంత్రం ఆరు గంటలకు ముగియాల్సిన పోలింగ్ 20 నిమిషాలపాటు ఆలస్యంగా కొనసాగింది. 19 మంది ఆరు గంటలలోపే కేంద్రాలకు చేరుకోవడంతో వారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు.

● మండలంలోని సింగారం గ్రామానికి చెందిన రెండు కుటుంబాలు చాంద్‌బీ- హసన్ వారి కూతురు నస్రీన్, ఆఫ్రీన్, ఇబ్రహీం, దస్తగిరిలు ఓటు వేసేందుకు రెండు రోజుల ముందే స్వగ్రామానికి చేరుకున్నారు. ఓటు వేయడం కోసం సుమారు రూ.20 వేలు వెచ్చించి గ్రామానికి వచ్చామని పేర్కొన్నారు.

● ఓటేసిన 104 ఏళ్ల అవ్వ

మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన 104 ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధురాలు ఎలగందుల మల్లవ్వ స్థానిక వృద్ధుల డే కేర్ సెంటర్‌లోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకుంది. ఆమెను కుటుంబ సభ్యులు ప్రత్యేక వాహనంలో కేంద్రానికి తీసుకొచ్చారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండలంలో 76.96 శాతం పోలింగ్ నమోదైనట్లు సెక్టోరియల్ అధికారులు జ్యోతి, జనార్దన్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రమేష్ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పారా మిలిటరీ బలగాలతో బందోబస్తు నిర్వహించారు. మండలంలో ప్రశాంతంగా పోలింగ్ కొనసాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు స్వచ్ఛం దంగా సహకరించాయి. యువతీ యువకులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి, బంజేరులో ఉదయం ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్‌కు అంతరాయం కలిగింది. సంబంధిత అధికారులు సరిచేయడంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.

● వీర్నపల్లి మండలంలోని రంగంపేట, మద్దిమల్ల, గర్జనపల్లితోపాటు పలు గ్రామాల పోలింగ్ కేంద్రాలలో ఓటేస్తేందుకు వచ్చిన వృద్ధులకు తిప్పలు తప్పలేదు. పలుచోట్ల పోలింగ్ కేంద్రాల వద్దకు వాహనాలు అనుమ తించకపోవడంతో దూరం నుంచి నడుచుకుంటూ వచ్చి వృద్ధులు ఓటేశారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరినా కొన్ని గ్రామాల్లో మాత్రం మధ్యాహ్నం సమయంలో ఎండ వేడిమికి పోలింగ్ కేంద్రాలు నిర్మానుష్యంగా కనిపించాయి. ఎస్పీ అఖిల్ మహాజన్ గంభీరావుపేట, గోరంటాల తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్థానిక ఎస్సై రాంమోహన్ సిబ్బందితో కలిసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 50 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు జిల్లెల్ల, ఇందిరనగర్, నేరెళ్ల పోలింగ్ కేంద్రాలను ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి ఇందిరనగర్, కేసీఆర్ నగర్, మండెపల్లి తదితర కేంద్రాలను పరిశీలించారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ముస్తాబాద్‌లో ఇద్దరు వ్యక్తులు రెండు నిమిషాలు ఆలస్యంగా రావడంతో తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపాయారు. ఎస్సై శేఖర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి దంపతులు తమ ఓటు హక్కును సొంత గ్రామమైన నామాపూర్‌లో వినియోగించుకున్నారు. యువతి యువకులు నూతనంగా తమ ఓటు హక్కును వినియోగించుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీపీ శరత్‌రావు మద్దికుంటలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● మండలంలోని ఆవునూర్ గ్రామానికి చెందిన ఏనుగుల బాబురావు దుబాయ్‌లోని ఆల్ సాహిల్ కాంట్రాక్ట్ కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. తన ఓటు వినియోగించుకోవడానికి ఆదివారం రాత్రి దుబాయ్ నుంచి వచ్చాడు. ఓటు హక్కును వినియోగించుకున్నాడు. మద్దికుంట గ్రామానికి చెందిన మద్దికుంట సుధాకర్‌రావుతోపాటు, మద్దికుంట శ్రావణ్‌కుమార్, మాధురి దంపతులు నవీ ముంబాయిలో వృత్తిరీత్యా స్థిరపడ్డారు. ఫ్లైట్ ద్వారా వచ్చి ఓటు వేశారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

వేములవాడలో..

వేములవాడ టౌన్: వేములవాడలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగింది. పట్టణంతో పాటు మండలంలోని సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, నాంపల్లి, కొడుముంజ, చింతలఠాణ, మారుపాక, చంద్రగిరి, తిప్పాపపూర్, శాత్రాజుపల్లి, కొనాయపల్లి గ్రామాల్లో ఉదయం 6 గంటల సమయంలోనే ఓట్లు వేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. అప్పటికే ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకొని ఓటర్లకు ఇబ్బందుల తలెత్తకుండా ఓటరు స్లిప్‌లను అందజేశారు. వృద్ధులు వికలాంగులకు ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగేలా అధికారులు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టారు. వేములవాడ మండలంలోని చంద్రగిరికి చెందిన పలువురు హిజ్రాలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో ఉదయం పోలింగ్ సజావుగా కొనసాగుతున్న తరుణంలో అనుకోకుండా ఈవీఎం సమస్య తలెత్తింది. 30 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది. సంబంధిత అధికారులు అప్రమత్తమై ఈవీఎంలను సరిచేసి పోలింగ్‌ను కొనసాగించారు.

● పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కర్నూల్ 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న గడ్డం వందన తన ఓటు హక్కును వినియోగించు కునేందుకు వేములవాడకు వచ్చారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి ఓటు వేశారు.. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి తన భర్త రాజుతో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటును వినియోగించుకున్నారు. జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రవ్వబాబు తమ ఓటును వినియోగించుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆయన సతీమణి ప్రతాప హిమజతో కలిసి ఓటు వేశారు.

● పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు వేములవాడ పట్టణంతోపాటు మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ, రూరల్ సీఐలు పర్యవేక్షించారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలంలో పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్ పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికలు జరిగాయి. కోనరావుపేటలో 28.56 శాతం పోలింగ్ నమోదయింది ఓటర్లు ఉదయం నుంచే ఓటు వేయడానికి బారులుదీరారు. కోనరావుపేట మండలం రామన్నపేటలో జడ్పీ ఛైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ ఓటు వేశారు. మల్కపేటలో ఓటు వేసిన చల్మెడ లక్ష్మీనర్సింహారావు దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నాగారంలో మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, బీజేపీ నేత వికాస్‌రావు ఓటు వేశారు.

బోయినపల్లి: మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 23 గ్రామాలు ఉండగా 41 పోలింగ్ కేంద్రాలను అధికారులు నిర్వహించారు. పోలింగ్ శాతం 76.12 శాతంగా నమోదైంది. కొదురుపాక నీలోజుపల్లి గ్రామాల్లో పోలింగ్ సరళిని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. కొదురుపాకలో రాజ్యసభ ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్, దంపతులు జడ్పీటీసీ కత్తెరపాక ఉమా కొండయ్య ఓటు వేశారు.

చందుర్తి : మండలంలోని 33 పోలింగ్ బూత్‌లలో సోమవారం కరీంనగర్ లోక్ సభ స్థానానికి జరిగిన పోలింగ్ ప్రశాంతగా ముగిసింది.సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. పలు కేంద్రాల్లో ఓటింగ్ యంత్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి, వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించారు. మండలంలోని జోగాపూర్‌లో జడ్పీటసీ నాగం కుమార్, నర్సింగాపూర్‌లో ఎంపీపీ బైరగోని లావణ్య ఓటు వేశారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని రుద్రంగి, మానాల, బడి తండాల్లోని పోలింగ్ బూతులను ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. ఎస్సై సిరిసిల్ల అశోక్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● రుద్రంగి మండల కేంద్రంలోని 93వ బూత్‌లో ఈవీఎం మోరాయించడంలో అరగంట ఓటింగ్ నిలిచిపోయింది. పోలింగ్ అధికారులు టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌తో సమస్యను పరిష్కరించారు.

● రుద్రంగి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్‌లోకి పోలింగ్ సమయం ముగిసిన ఐదు నిమిషాలకు ఇద్దరు ఓటర్లు ఆలస్యంగా వచ్చారు. దీంతో ఎన్నికల అధికారులు వారిని ఓటు వేయడానికి నిరాకరించడంతో నిరాశతో వెనుదిరిగారు.


గజసింగవరంలో ఓటు వేసిన కొండూరు రవీందర్‌రావు


సంకెపల్లిలో బారులుదీరిన ఓటర్లు


విలీన గ్రామంలో బారులుదీరిన ఓటర్లు


ఓటు వేసిన జడ్పీ ఛైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ


మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ, మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, బీజేపీ నేత వికాస్‌రావు


ఓటు వేసిన చల్మెడ లక్ష్మీనర్సింహారావు దంపతులు, వేములవాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి


నామాపూర్‌లో ఓటు వేసిన కేకే మహేందర్‌రెడ్డి దంపతులు


గంభీరావుపేటలో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం


కొదురుపాకలో సంతోష్‌కుమార్ దంపతులు


ఓటు వేసిన కర్నూల్ 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గడ్డం వందన, డీఎస్పీ నాగేంద్రచారి


ఓటు వేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న మనీషా, మానస


దివ్యాంగురాలికి సాయం చేస్తున్న ఎస్సై అశోక్


గోరంటాలలో..